వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 50 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-

## సుప్రీంకోర్టులో సెల్ఫీలు, రీల్స్ నిషేధం

- హై సెక్యూర్టీ ఏరియాలో ఫోటోలు, వీడియోలు బ్యాన్

**న్యూఢిల్లీ**
ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీపై సుప్రీంకోర్టు లో నిషేధం విధించారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఫోటోలు, వీడియోలు తీయడం ఇక చెల్లదు. ఒకవేళ ఎవరైనా ఈ నియమావళి ఉల్లంఘిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. శుక్రవారం కోర్టు సెక్రటరీ జనరల్ ఈ సర్క్యూలర్ జారీ చేశారు. ఆ ఆదేశాలు లాయర్లు, ఫిర్యాదుదారులు, ఇంటర్న్‌లు, న్యాయ క్లర్క్‌లు, స్టాఫ్, విజిటర్స్‌కు వర్తించనున్నాయి. కేవలం అధికార ప్రోగ్రామ్‌లకు మాత్రమే ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అనుమతించనున్నారు.కెమెరాలు, ట్రైపాడ్లు, సెల్ఫీ స్టిక్‌లు, మొబైల్ ఫోన్ల ద్వారా వీడియోలు, రీల్స్ చేయడాన్ని సుప్రీంకోర్టులో బ్యాన్ చేశారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఉన్న లాన్ ఏరియా కూడా నిషేధం ప్రదేశం కిందకు వస్తుంది. మీడియా వ్యక్తులు -మిగతా 3 లో





## దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

**బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్**

- గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు
- తీరప్రాంత ఆలయాల అభివృద్ధికి తక్షణ చర్యలు
- ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి
- రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలి
- పుష్కరాలపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి


**హైదరాబాద్**
గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు-చేయాలన్నారు. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీంతో పాటు- పుష్కరాల ఏర్పాట్లు-, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు-, ముందస్తు సన్నద్ధతపై శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు- మంత్రి కొండా సురేఖ, -మిగతా 3 లో



## కర్నాటకలో మళ్లీ కులగణన

- సామాజిక అసమానతలు గుర్తించేందుకు సర్వే
- కర్నాటక సీఎం సిద్దరామయ్య స్పష్టీకరణ

**బెంగళూరు**
రాష్ట్రంలో మళ్లీ కొత్తగా కులగణన చేపట్టనున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గతంలో ఇచ్చిన నివేదికను అంగీకరించబోమని.. సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 7 మధ్య మళ్లీ కులగణన చేపడతామని వెల్లడించారు. గతంలో చేపట్టిన కులగణన సమాచారం దాదాపు పదేళ్ల కిందటిది గనక ప్రస్తుతం సమాజంలోని వాస్తవాలను తెలుసుకోవడానికి కొత్తగా సర్వే అవసరమని -మిగతా 3 లో



## కామారెడ్డి కాంగ్రెస్ సభ వాయిదా

- భారీ వర్షాల హెచ్చరిక కారణంగా ఈ నిర్ణయం
- సభ తిరిగి ఎపుడు నిర్వహిస్తామనేది త్వరలో వెల్లడి

**హైదరాబాద్,**
కామారెడ్డిలో 15న జరగనున్న సభను టీపీసీసీ వాయిదా వేసింది. భారీ వర్షాల సూచనతో సభను వాయిదా వేసినట్లు తెలిపింది. సభ తిరిగి ఎపుడు నిర్వహిస్తామనేది త్వరలో చెబుతామని ప్రకటించింది. బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి గడ్డ మీద నుంచే రిజర్వేషన్లకు అడ్డుగా ఉన్న బీజేపీ సర్కారు మీద సమర శంఖం పూరించేందుకు కాంగ్రెస్ సిద్ధమైన సంగతి తెలిసిందే.. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 15న కామారెడ్డిలో భారీ బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు- చేస్తోంది. భారీ సభ నిర్వహించడం బీజేపీ మీద ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకత్వం సన్నాహాలు చేస్తోంది. కామారెడ్డి సభకు కనీసం 2 లక్షల మందిని -మిగతా 3 లో





## సింగరేణికి కొత్త బ్లాక్‌లు దక్కడం లేదు

- ఖనిజాల తవ్వకాల్లోను సింగరేణికి ప్రాధాన్యం ఇవ్వాలి
- గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతున్న సింగరేణి
- మీడియా సమావేశంలో డిప్యూటి సీఎం భట్టి

**హైదరాబాద్,**
సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఖనిజాల తవ్వకాల్లోనూ పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుందని డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. సింగరేణి బోర్డు బొగ్గు తవ్వకాలు పెంచడంతోపాటు ఇతర మినరల్స్ మైనింగ్ చేయాలని నిర్ణయం తీసుకుందని -మిగతా 3 లో



## నేపాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం..

**మొదటి మహిళా ప్రధానిగా చరిత్ర సృష్టించిన సుశీల**


**న్యూఢిల్లీ,**
గత నాలుగైదు రోజులుగా అట్టుడికిన నేపాల్‌లో కొత్త అధ్యాయం మొదలైంది. ఆ దేశ చరిత్రలో తొలి ప్రధాన మంత్రిగా మాజీ జస్టిస్ సుశీల కర్కి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం తాత్కాలిక ప్రధానిగా ఎంపికైన ఆమె రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. రాత్రి 9:00 గంటల తర్వాత శీతల్ నివాసంలో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్‌ఆమెతో పదవీ ప్రమాణం చేయించారు.తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి ఎంపికైన తర్వాత ప్రెసిడెంట్ రామ్‌చంద్ర పౌడెల్ పార్లమెంట్‌ను రద్దు చేశారు. -మిగతా 3 లో

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

**రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము**

- హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కూడ

**న్యూఢిల్లీ,**
భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, -మిగతా 3 లో





## ఓటు చోరీ కాదు.. ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడాలి

- రాహుల్‌కు కేటీఆర్ గట్టి సవాల్

**హైదరాబాద్,**
బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ మార్చిన ప్రతి ఒక్క ఎమ్మెల్యేను రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు స్వయంగా కలిశారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు తీసుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో చూపించి ఇవ్వాళ వీళ్లను మీరు గుర్తుపట్టగలరా అని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ కండువా కప్పకున్న ఎమ్మెల్యేలు, ఇప్పుడు మేము కాంగ్రెస్‌లో చేరలేదని అంటున్నారు.. ఇది ఎంత వరకు కరెక్ట్ అని కేటీ-ఆర్ ప్రశ్నించారు. అది కాంగ్రెస్ కండువా కాదు అని అంటు-న్నారు, మీరు దీన్ని ఒప్పకుంటారా అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఇది ఎమ్మెల్యేల చోరీ కాకపోతే ఇంకేమిటి?' అంటూ రాహుల్ గాంధీని నిలదీశారు. -మిగతా 3 లో

## పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట పనులు

**ఈసారి అక్కడే బతుకమ్మ ఉత్సవాలకు ప్లాన్**



- యాకుతుపురా ఘటనపై బాధ్యులపై చర్యలు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

3 లో

## రైతు సమస్యలు ప్రస్తావిస్తే కేసులా

- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,**
రైతుల యూరియా కష్టాలను చూపిస్తే మీడియాపై కేసులు పెడతారా..? అణిచివేతలు, ఆంక్షలతో జర్నలిస్టులను భయపెడుతారా..? అని కాంగ్రెస్ సర్కార్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రైతులు పడుతున్న యూరియా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన ఖమ్మం రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం అని మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన -మిగతా 3 లో



# మీ కామెంట్స్‌కు అర్థం ఏమిటి..?'

### కంగనా రనౌత్‌కు సుప్రీంకోర్టు చీవాట్లు




**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
బాలీవుడ్ నటి , బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ కు సుప్రీంకోర్టు చురకలు వేసింది. తనపై నమోదైన క్రిమినల్ డిఫమేషన్ కంప్లయింట్ ను కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది.కంగనా తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచించింది. దాంతో కంగనా రనౌత్ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 2021లో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతుల ఆందోళన సందర్భంగా మహిందర్ కౌర్ అనే వృద్ధ మహిళను కించపర్చేలా రీట్వీట్ చేశారు. ఆమె రూ.100 కిరాయికి వస్తుందని తన రీట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మహిందర్ కౌర్ పరువునష్టం కేసు వేశారు. దాంతో కౌర్ ఫిర్యాదును కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కంగనా ముందుగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆమెకు చీవాట్లు పెట్టింది. 'మీ వ్యాఖ్యలకు అర్థం ఏమిటి..? మీది సింపుల్ రీట్వీట్ కాదు. మీరు మీ సొంత కామెంట్స్ చేశారు. మసాలా జోడించారు' అని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.దాంతో తన క్లయింట్ ఆ రీట్వీట్‌పై క్లారిఫికేషన్ ఇచ్చారని కంగనా తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లగా..
ఆ క్లారిఫికేషన్ ట్రయల్ కోర్టుకు ఇవ్వండని ధర్మాసనం సూచించింది. కంగనా పంజాబ్‌కు వెళ్లే పరిస్థితి లేదని న్యాయవాది చెప్పగా.. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరవచ్చని కోర్టు పేర్కొంది. న్యాయవాది మరేదో వాదన చేయబోతుండగా.. 'ఆమె ట్వీట్‌పై మా స్పందన కోరే ప్రయత్నం చేయకండి' అని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది.

# సెప్టెంబర్ 15 నుంచి రుతుపవనాల తిరోగమనం



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
సెప్టెంబర్ 15వ తేదీ నుంచి వాయవ్య భారతం నుంచి నైరుతీ రుతుపవనాలు తిరోగమనం చెందనున్నట్లు ఇవాళ భారతీయ వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా జూన్ ఒకటో తేదీన కేరళలో నైరుతీ రుతుపవనాలు ఎంటర్ అవుతాయి.ఆ తర్వాత జూలై 8వ తేదీ వరకు దేశవ్యాప్తంగా వర్షాలు నమోదు అవుతాయి. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి వాయవ్య భారతం నుంచి రుతుపవనాలు తగ్గుతూ అక్టోబర్ 15వ తేదీ నాటికి పూర్తిగా కనుమరుగు అవుతాయి. అయితే ఈ ఏడాది పశ్చిమ రాజస్థాన్ నుంచి రుతుపవనాలు సెప్టెంబర్ 15వ తేదీ నుంచే తిరోగమనం చెందనున్నట్లు ఐఎండీ ఒక ప్రకటనలో తెలిపింది.ఈ ఏడాది రుతుపవనాలు.. జూలై 8 కంటే 9 రోజులు ముందుగానే దేశం మొత్తం కమ్మేశాయి. 2020 తర్వాత తొలిసారి రుతుపవనాలు జూన్ 26వ తేదీ కన్నా ముందు కవర్ చేశాయి. ఈ ఏడాది మే 24వ తేదీన కేరళకు రుతుపవనాలు చేరుకున్నాయి. 2009 తర్వాత ఈసారి అనుకున్న తేదీ కన్నా ముందుగా ప్రవేశించాయి. ఆ ఏడాది మే 23వ తేదీన రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది వర్షాకాలంలో దేశవ్యాప్తంగా 836.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. సాధారణంగా 778.6 ఎంఎం వర్షం కురుస్తుంది. అయితే దాని కంటే ఏడు శాతం అధికంగా వర్షం పడింది. ఈసారి 106 శాతం వర్షం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నట్లు మే నెలలో ఐఎండీ అంచనా వేసింది. 96 నుంచి 104 శాతం మధ్య వర్షం నమోదు అయితే, గత 50 ఏళ్ల నుంచి దాన్ని నార్మల్‌గా భావిస్తున్నారు.

# ఈ ఏడాది చివర్లో భారత్‌కు ట్రంప్?



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
రష్యా చమురు కొనుగోలు కారణం చూపి ట్రంప్ విధించిన భారీ సుంకాలతో భారత్-అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సుంకాల వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఈ ఏడాది చివర్లో భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో భారత్‌లో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు భారత్‌కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ వెల్లడించారు. ఈ సదస్సు కోసం ఆయన ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నాయని వివరించారు.2017లో భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు క్వాడ్ కూటమిని ఏర్పాటు చేశాయి. నాలుగు అగ్రదేశాలతో ఏర్పడిన కూటమి అధినేతలు 2021 సెప్టెంబరు 24న వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ అయ్యారు. ఇక గతేడాది సదస్సుకు అమెరికా ఆతిథ్యం ఇచ్చింది. ఈ సారి క్వాడ్ దేశాధినేతల సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. నవంబరులో న్యూ ఢిల్లీలో జరగబోయే సదస్సుకు ఆయా దేశాధినేతలు హాజరుకానున్నారు. ఈ కూటమి విదేశాంగ మంత్రుల సమావేశం ఈ ఏడాది జనవరిలో అమెరికాలో జరిగిన విషయం తెలిసిందే.

# నేపాల్‌లో దారుణ ఘటన

### హోటల్‌కు నిప్పు పెట్టిన దుండగులు
### యూపికి చెందిన మహిళ మృతి




**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
:పొరుగు దేశం నేపాల్ లో జడ్ జనరేషన్- యువత నిర్వహిస్తున్న ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఆర్మీ కంట్రోల్ లోకి తీసుకున్న తర్వాత పరిస్థితులు కాస్త చక్కబడినట్లే కనిపించినా.. అక్కడక్కడ నిరసనకారులు పేట్రేగిపోతున్నారు. నిరసనల్లో భాగంగా ఒక హోటల్ కు నిప్పు పెట్టడంతో.. భారత్ కు చెందిన మహిళ చనిపోవడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ కు చెందిన రాజేశ్ గోలా అనే 57 ఏళ్ల మహిళ చనిపోయింది. టూర్ కు వెళ్లిన కుటుంబం హయత్ రెజెన్సీలో ఉండగా ఆందోళన కారులు నిప్పు పెట్టారు. హోటల్ మంటల్లో చిక్కుకోవడంతో దూకి పారిపోయే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయినట్లు- ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మంటలు పూర్తిగా వ్యాపించడంతో భయంతో ఒక్కసారిగా బిల్డింగ్ మీది నించి జంప్ చేసింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమె భర్త రాంవీర్ సింగ్ గోలా ఆమెను ఖాట్మండులోని త్రిభువన్ యూనివర్సిటీ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆమె చనిపోయినట్లు- వైద్యులు ప్రకటించారు.

# ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపులు..


### మూడు చోట్ల పేలుడు పదార్థాలు ఉన్నాయంటూ మెయిల్.. పోలీసులు అలర్ట్




**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
దేశ రాజధాని ఢిల్లీ లో బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపాయి. ఇటీవలే నగరంలోని పలు పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు అలర్ట్ అయ్యారు.ఢిల్లీ పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. శుక్రవారం ఉదయం ఢిల్లీ హైకోర్టులో బాంబులు పెట్టినట్లు ఈమెయిల్ వచ్చింది. కోర్టు ప్రాంగణంలో మూడు బాంబులను అమర్చామని, మరికాసేపట్లో అవి పేలుతాయంటూ అందులో బెదిరించారు. మధ్యాహ్నం 2 గంటల్లోపు ఖాళీ చేయాలని సూచించారు. అయితే, పేలుడు పదార్థాలు ఎక్కడెక్కడ పెట్టారన్నది అందులో పేర్కొనలేదు. ఈ బెదిరింపు మెయిల్‌తో పోలీసులు అలర్ట్ అయ్యారు. వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టులోని న్యాయమూర్తులు , న్యాయవాదులు, సిబ్బందిని బయటకు పంపించారు. అనంతరం తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ బెదిరింపులతో కోర్టు కార్యకలాపాలు నిలిచిపోయాయి.

# బెంగళూరులో అధ్వాన్నంగా రోడ్లు.. గుంతలోకి ఒరిగిపోయిన బస్సు

**బెంగళూరు - ప్రజా స్వేచ్ఛ**




కర్ణాటక రాజధాని బెంగళూరులో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారీ గుంతలోకి స్కూల్ బస్సు ఒరిగిపోయింది. స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆ బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. బెంగళూరులోని చాలా రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. వాహనాల ప్రమాదాలకు నిలయంగా మారాయి. శుక్రవారం ఉదయం గుంతలతో నిండిన పాణత్తూరు-బలగెరె ప్రధాన మార్గంలో రెండు స్కూల్ బస్సులు ప్రయాణించాయి.కాగా, ఒక స్కూల్ బస్సును దాటి ముందుకు వెళ్లేందుకు మరో స్కూల్ బస్సు ప్రయత్నించింది. అయితే సుమారు 20 మంది విద్యార్థులున్న ఆ స్కూల్ బస్సు రోడ్డు పక్కగా బురదమయంగా ఉన్న గుంతలో కూరుకుపోయింది. సగానికిపైగా బస్సు ఒక పక్కకు ఒరిగిపోయింది. దీంతో అందులో ఉన్న విద్యార్థులు భయాందోళన చెందారు. మరోవైపు ఇది గమనించిన స్థానికులు వెంటనే ఆ స్కూల్ బస్సు వద్దకు చేరుకున్నారు. విండోల వద్ద ఉన్న ఎమర్జెన్సీ డోర్లు తెరిచారు. ఆ బస్సులో ఉన్న స్కూల్ పిల్లలను సరక్షితంగా బయటకు తెచ్చారు. ఆ స్కూల్ బస్సు వెనుక ఉన్న కారు డ్యాష్ బోర్డు కెమెరాలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.కాగా, ఈ సంఘటన నేపథ్యంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని బెంగళూరులోని రోడ్ల దుస్థితిపై మండిపడ్డారు.

# నేడు మణిపూర్‌లో మోడీ పర్యటన




**ఇంఫాల్ - ప్రజా స్వేచ్ఛ**
రెండేళ్లకుపైగా హింసాకాండతో రగులుతున్న మణిపూర్‌లో ఎట్టకేలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటించనున్నారు. శనివారం మణిపూర్‌కు రానున్న మోడీ ఇంఫాల్, చురాచంద్‌పూర్‌లో పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న నిరాశ్రయులను పరామర్శించనున్నారు. రూ.8,500 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించనున్నారని మణిపూర్ చీఫ్ సెక్రటరీ పునీత్ కుమార్ గోయెల్ శుక్రవారం తెలిపారు. చురాచంద్‌పూర్‌లోని పీస్ గ్రౌండ్ నుంచి రూ.7,300 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన చేస్తారని, రాష్ట్ర రాజధాని ఇంఫాల్ నుంచి రూ.1,200 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభిస్తారని తెలిపారు. మోడీ పర్యటన సందర్భంగా భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మణిపూర్‌లో నరమేధాన్ని, మహిళలపై అకృత్యాలను అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, ఇన్నేళ్ల పాటు మొఖం చాటేసిన మోడీ తీరును నిరసిస్తూ 'గో బ్యాక్ మోడీ - ఓ కసాయి' పేరిట రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపనున్నట్లు ప్రముఖ మహిళా సంఘాలు ప్రకటించాయి.

# ప్రారంభమైన రష్యా బెలారస్‌ల సంయుక్త సైనిక విన్యాసాలు



**మాస్కో - ప్రజా స్వేచ్ఛ**
నాటో సరిహద్దుల్లో శుక్రవారం రష్యా, బెలారస్‌లు సంయుక్త సైనిక విన్యాసాలను ప్రారంభించినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. జపాడ్ -2025 వ్యాయామంలో భాగంగా రష్యా మరియు బెలారస్‌లు సంయుక్తంగా ఆయుధాలను ప్రదర్శించనున్నాయి. "కమాండర్లు మరియు సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, ప్రాంతీయ మరియు సంకీర్ణ దళాల సమూహాల సహకార స్థాయి మరియు క్షేత్రస్థాయిలో శిక్షణను మెరుగుపరచడం ఈ సైనిక విన్యాస లక్ష్యాలు" అని టెలిగ్రామ్‌లో పేర్కొంది. పోలాండ్ సరిహద్దులో చేపడుతున్న సైనిక విన్యాసాలు ఏ దేశానికి వ్యతిరేకంగా చేపట్టడం లేదని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రీ పెస్కోవ్ గురువారం తెలిపారు.

# నేపాల్ ఆందోళనలు.. మృతుల సంఖ్య 51



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
నేపాల్‌లో సోషల్ మీడియాపై నిషేధం విధిస్తూ ఆ దేశ పార్లమెంట్ తీసుకున్న నిర్ణయంపై జెన్ జెడ్ చేపట్టిన నిరసనలు బీభత్సవం సృష్టించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో పలువురు మరణించారు. తాజాగా మృతుల సంఖ్య 51కి పెరిగింది. వారిలో 30 మంది బుల్లెట్ గాయాల తో మరణించిన వారు ఉన్నారు. మిగతా 21 మంది మంటలు అంటుకుని, ఇతర గాయాలతో మరణించారు. మృతుల్లో పౌరులతోపాటు పోలీసులు కూడా ఉన్నారు. నేపాల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం మధ్యాహ్నం ఈ వివరాలను వెల్లడించింది.కాగా, నేపాల్ రాజధాని ఖాట్మండులో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యింది. దాంతో కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పగించే కార్యక్రమం మొదలైంది. ఈ క్రమంలో ఆస్పత్రి పరిసరాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా వందల మంది గాయాలతో చికిత్స పొందుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

# సుప్రీంకోర్టులో సెల్ఫీలు, రీల్స్ నిషేధం

(మొదటి తరువాయి)

కూడా తమ ఇంటర్వ్యూలు, లైవ్ బ్రాడ్‌కాస్ట్‌లు.. నిర్దేశిత లో సెక్యూర్టీ జోన్ నుంచి చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా రిపోర్టర్ ఆ నియయావళి ఉల్లంఘిస్తే, అతనికి హై సెక్యూర్టీ జోన్‌లో నెల రోజుల పాటు నిషేధం విధించనున్నారు. ఆదేశాలు ఉల్లంఘించే అడ్వకేట్లు, ఇంటర్న్‌లు, న్యాయ సిబ్బందిని సంబంధిత బార్ అసోసియేషన్లకు ఫిర్యాదు చేస్తారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఎవరు ఫోటోలు, వీడియోలు తీసినా వారిని అడ్డుకునే అధికారం సెక్యూర్టీ సిబ్బందికి ఉంటుంది.

# కర్నాటకలో మళ్లీ కులగణన

(మొదటి తరువాయి)

ఆయన అన్నారు. సమాజంలో అనేక కులమతాలతో పాటు- సామాజిక అసమానతలు కూడా ఉన్నాయి. దేశంలోని ప్రజలంతా సమానమేనని.. ప్రజలందరికీ సమాన సామాజిక న్యాయం జరగాలని రాజ్యాంగం చెబుతోంది. దాని ప్రకారమే.. ప్రజల మధ్య అసమానతలను తొలగించి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు సృష్టించే దిశగా ముందడుగు వేయడానికి మేము నిర్వహించే నూతన సర్వే ఉపయోగపడుతుందని సిద్ధరామయ్య తెలిపారు. 2015లో కర్ణాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో రాష్ట్రంలో మరోసారి కులగణన చేపట్టనున్నట్లు- ప్రకటన వెలువడింది. రాష్ట్రంలో మళ్లీ కులగణన చేపట్టాలని కాంగ్రెస్ అధిష్ఠానం సైతం ఇటీవల కర్ణాటక ప్రభుత్వానికి సూచించింది.

# కామారెడ్డి కాంగ్రెస్ సభ వాయిదా

(మొదటి తరువాయి)

సమీకరించాలని పార్టీ నాయకులు టార్గెట్ గా పెట్టుకున్నారు. కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్లా జిల్లాల నుంచి ప్రధానంగా జనాన్ని తరలించాలని భావిస్తు న్నారు. ఈ జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులతో పీసీసీ లీడర్లు జనాలను తరలించే విషయంలో చర్చిస్తున్నారు. కామారెడ్డికి దగ్గరగా ఉండే మండలాలపై ఫోకస్ పెట్టాలని సూచిస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రానుండడంతో గ్రామ, మండలస్థాయి లీడర్లు కూడా ఉత్సాహం పనిచేసే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ఈ సభకు కాంగ్రెస్ జాతీయ స్థాయి నాయకులు హాజరు కావచ్చునని తెలుస్తోంది. ఈ క్రమంలోనే సభ నిర్వహణ, జన సమీకరణ తదితర అంశాలను పరిశీలించేందుకు ఆదివారం కామారెడ్డిలో సన్నాహాక సమావేశం జరిగింది. సభ సక్సెస్ చేసేందుకు ఎలా పని చేయాలో పార్టీ శ్రేణులకు పీసీసీ చీఫ్ మంత్రులు దిశానిర్దేశర చేశారు. అయితే తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరికతో సభను వాయిదా వేస్తున్నట్లు- టీపీసీసీ ప్రకటించింది.

# నేపాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం..


(మొదటి తరువాయి)



దాంతో, తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరేందుకు మార్గం సుగమం అయింది. రాష్ట్రపతి భవన్‌లో అధ్యక్షుడు పౌడెల్ కర్కితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొద్దిమంది మంత్రివర్గంతో ప్రధాని క్యాబినెట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది మార్చిలో నేపాల్ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. అప్పటివరకూ సుశీల నేతృత్వంలోని ప్రభుత్వం కొనసాగనుంది.దేశంలో నెలకొన్న అవినీతి పాలన, నాయకుల బంధుప్రీతికి తోడూ సోషల్ మీడియాపై నిషేధం విధించడంపై నేపాల్ యువతరం భగ్గుమంది. ప్రధాని కేపీ ఓలీ సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 8న శాంతియుతంగా ఆందోళనలకు దిగారు జెన్ జెడ్. అయితే.. పోలీసులు వీళ్లను అణచివేసేందుకు కాల్పులు జరపగా 19 మరణించారు. దాంతో.. ఆగ్రహించిన యువత నిరసనలను హింసాత్మకంగా మార్చాయి. నేపాల్ పార్లమెంట్, సుప్రీంకోర్టుతో పాటు అధ్యక్ష భవనాన్ని ముట్టించిన ఆందోళనకారులు వాటన్నింటికీ నిప్పు పెట్టారు. దాంతో.. సైన్యం ఆదేశాలమేరకే ప్రధాని పదవికి కేపీ ఓలీ రాజీనామా చేశారు. నేపాల్ వ్యాప్తంగా చెలరేగిన ఈ అల్లర్లలో మృతుల సంఖ్య 51కి చేరింది.

# రైతు సమస్యలు ప్రస్తావిస్తే కేసులా

(మొదటి తరువాయి)



జర్నలిస్టుపై పోలీసులు ఉల్టా కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. గడిచిన 2 నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం.. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం శోచనీయం. శాంతిభద్రతల నిర్వహణను పక్కన పెట్టి ప్రజల గొంతు నొక్కేందుకు పోలీసులను వాడడం అప్రజాస్వామికం. జర్నలిస్ట్ సాంబశివరావుపై పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

(మొదటి తరువాయి)

సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయాల వద్ద శాశ్వత ఘాట్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సారి రెండు లక్షల మంది స్నానాలు చేసేందుకు వీలుగా ఘాట్లు ఉండాలని సూచించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు గోదావరి పరిసర ఇతర ఆలయాల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల సమీపంలో ఉన్న గోదావరి పరీవాహక ఆలయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఘాట్స్‌ను విస్తరించడంతో పాటు- రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటు-పాట్లు- లేకుండా తగిన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.అయితే, 2027లో జులై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి దాదాపు 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వతమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీర ప్రాంతముంది. దాదాపు 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు- చేయాల్సిన అవసరముంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతో పాటు- అన్ని ప్రధాన ఆలయాలను మొదటగా అభివృద్ధి చేయాలన్నారు ముఖ్యమంత్రి రేవంత్. ఇక, ప్రధాన ఆలయాల దగ్గర భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది, ఆలయ పరిసరాల్లోని పుష్కర ఘాట్ల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు- అక్కడ శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు- వాహనాల పార్కింగ్, తాగు నీరుతో పాటు- భక్తులకు అవసరమైన వసతులన్నీ ఉండేలా చేసుకోవాలన్నారు. అలాగే, మహా కుంభమేళాతో పాటు- గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు- గోదావరి తీరం వెంట ఉన్న అన్ని ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేయాలన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలన్నారు. ఇక, పుష్కరాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ తో పాటు- అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలన్నారు. దక్షిణ భారత కుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కేంద్రం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో పర్యాటక శాఖ, నీటి పారుదల శాఖ, దేవాదాయ శాఖ సమన్వయంతో పని చేయాలని రేవంత్ రెడ్డి అన్నారు.

# సింగరేణికి కొత్త బ్లాక్‌లు దక్కడం లేదు

(మొదటి తరువాయి)



భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాయచూరు, దేవదుర్గ ప్రాంతాల్లో కాపర్ అండ్ గోల్డ్ మైనింగ్ యాక్షన్‌లో సింగరేణి పాల్గొందని గుర్తు చేశారు. దాని వల్ల సింగరేణి 37.75శాతం వాటాను దక్కించుకుందని హర్షం వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు- వ్యక్తులకు వెళ్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు- వ్యక్తులకు వెళ్లాయని గుర్తు చేశారు. అందుకే సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని సూచించారు. దాంతో సింగరేణిలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశానికి క్రిటికల్ మినరల్స్ అందించడంలో భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళ్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.కీలక ఖనిజాల వెలికితీతలో కూడా కేంద్రం సింగరేణి సంస్థకు అవకాశం కల్పించాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాయచూర్, దేవదుర్గ్ బెల్ట్ లో రాగి, బంగారం ఖనిజాల అన్వేషణలో, కర్ణాటకలో రాగి, బంగారం, మైనింగ్ గనుల తవ్వకాల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొన్నదని భట్టి తెలియజేశారు. కీలక ఖనిజాల తవ్వకాల కోసం సింగరేణి గ్లోబల్ అనే పేరుతో వెళ్తుందని, దేశంలో జరుగుతున్న బొగ్గు గనుల వేలంతో కొన్నాళ్లుగా సింగరేణి పాల్గొనడం లేదని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో ఎందుకు పాల్గొనడం లేదో తాము పరిశీలించామని అన్నారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్ లు ప్రైవేటు- వ్యక్తులకు వెళ్తాయని, సింగరేణి సంస్థకు అదనంగా రావాల్సిన బొగ్గు బ్లాక్ లు దక్కడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. కొత్త బ్లాక్ లు కేటాయించకపోవడంతో సింగరేణి సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాక్ లు దక్కని పరిస్థితి వస్తోందని, కొత్త బ్లాక్ లు రాకుంటే సింగరేణి మూసి వేయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. సింగరేణికి కొత్త బ్లాక్ లు రాకపోవడంతో ఆ సంస్థతో పాటు- రాష్ట్రానికి నష్టం అని హెచ్చరించారు. వేలం ద్వారా పొందే రాయల్టీ ఆ రాష్ట్రాలకే చెందుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట పనులు

## ఈసారి అక్కడే బతుకమ్మ ఉత్సవాలకు ప్లాన్
## యాకుతుపురా ఘటనపై బాధ్యులపై చర్యలు
## హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



**హైదరాబాద్,** బతుకమ్మ కుంట పనులు పూర్తి కావొస్తున్నాయని, త్వరలో సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తాం అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నార . ఈసారి బతుకమ్మ పండుగ అక్కడే నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం అని కమిషనర్ తెలిపారు.సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదన్నారు. ఇకపోతే యాకుత్‌పురాలో ఐదేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తూ ప్రమాదవశాత్తూ మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఘటనపై హైడ్రా స్పందించింది. అయితే ఘటనపై వెంటనే గమనించిన బాలిక నాయనమ్మ, స్థానికులు సురక్షితంగా కాపాడారు. హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. యాకుత్‌పురా ఘటనపై రాజకీయపరంగా చేసే విమర్శలపై స్పందించను. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం అన్నారు. హైడ్రా వల్లే తప్పు జరిగిందని గుర్తించామని, ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్‌పై ఆడిట్ చేస్తున్నాం. మూతలు సరిగాలేనివి గుర్తించి.. సంబంధిత ఏజెన్సీకి సెక్రటరీ ద్వారా రిఫర్ చేస్తాం. జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదు. బ్లేమ్ గేమ్ కాకుండా సమన్వయంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ ఇన్‌ఛార్జి ఈ ఘటనకు బాధ్యుడు.. అతనిపై చర్యలు తీసుకుంటాం. ఆ చుట్టుపక్కల నాలుగైదు మ్యాన్ హోల్స్ ఉన్నాయి.. అందులో ఒకటి వాటర్ బోర్డు వాళ్లు క్లీన్ చేశారు. ఘటన జరిగిన మ్యాన్ హోల్ మాత్రం హైడ్రా సిబ్బంది క్లీన్
చేశారు. మంచి చేస్తేనే మా ఖాతాలో వేసుకోవడం కాదు.. తప్పు జరిగినప్పుడు కూడా అంగీకరిస్తున్నాం. ఇతర శాఖలతో చిన్న చిన్న సమస్యలు తప్ప పెద్ద ఇబ్బందులు లేవు. జీహెచ్‌ఎంసీ పెద్ద ఆర్గనైజేషన్.. మేము ఎవరిపై పెత్తనం చెలాయించట్లేదు. మా అందరికీ బాస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారు. మా శాంక్షన్ అయిన బడ్జెట్‌లో 3 నెలలది మాత్రమే రిలీజ్ అయింది. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేస్తాం.

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

(మొదటి తరువాయి)

హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఆర్‌ఎస్‌ఎస్, జన్‌సంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ పనిచేశారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా చేశారు. అభిమానులు ఆయనను తమిళనాడు మోదీగా పిలుస్తారు.

# ఓటు చోరీ కాదు.. ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడాలి

(మొదటి తరువాయి)



ఓటు చోరీ గురించి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకంటే, ఎమ్మెల్యేల చోరీ కూడా చిన్న నేరం కాదని వ్యాఖ్యానించారు. ఈ ద్వంద ప్రమాణాలపై రాహుల్ గాంధీకి సిగ్గు లేదని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.

## సంపాదకీయం

# వి'భజన'



సెప్టెంబరు పదకొండున మోహన్ భగవత్ 75వ జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి మోడీ రాసిన వ్యాసం ఒక వ్యక్తిగత స్తుతిగా ప్రారంభమై, చివరికి ఒక రాజకీయ గీతికగా ముగిసింది. ఇందులో ఆయన భగవత్‌ను "కరుణార్ద్ర నేత"గా, 'వసుధైక కుటుంబం' అనే భావనతో ప్రేరణ పొంది, సామాజిక మార్పు, శాంతి, సామరస్యం, సోదర భావమనే స్ఫూర్తిని బలోపేతం చేయడమే లక్ష్యంగా, తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహనీయుడిగా చిత్రీకరించారు. అయితే.. ఈ వ్యాసంలో మోడీ మోహన్‌భగవత్‌పై కురిపించిన అపారమైన ప్రశంసలకు సమాం తరంగా నిశ్శబ్దంగా దాచిన రాజకీయ వాస్తవాలనేకం కనిపిస్తాయి. వ్యాసం చదివితే అది పైకి ఒక ప్రశంసా గేయంగా అనిపిస్తుంది. అదే సమయంలో మోహన్ భగవత్ నేతృత్వంలో ఆరెస్సెస్ సాగిస్తున్న విభజన, విద్వేష రాజకీయాలను దాచిపెట్టే ప్రయత్నమూ కనిపిస్తుంది. భగవత్ జీవితాన్ని "వసుధైక కుటుంబం" అనే భావనకు ప్రతీకగా పేర్కొన్నారు మోడీజీ. కానీ వాస్తవం ఏమిటి? మోహన్ భగవత్ ఆధ్వర్యంలో ఆరెస్సెస్–బీజేపీ జంట నడిపిన రాజకీయాలు దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు ఏనాడూ చేయలేదు. పైగా వర్గాలుగా, మతాలుగా, కులాలుగా విభజించడానికే పనిచేశాయి. "వసుధైక కుటుంబం" అని గొంతెత్తి చెప్పే ఈ పెద్దమనుషుల ఆచరణలో 'భారతీయులంతా ఒకటే కుటుంబం' అన్న సూత్రం ఎక్కడా ఎప్పుడూ కనబడదు. వీరి హయాంలో 'హిందూ ఏకత్వం' పేరిట మైనార్టీలను ద్వితీయశ్రేణి పౌరులుగా మలచే అజెండా మునుపెన్నడూ లేనంత ఉధృతంగా ముందుకు నెట్టబడింది. మెజారిటీల్లో అసహనం, మైనార్టీల్లో అభద్రత ఒక జీవనవిధానంగా స్థిరపరిచే ప్రమాదకరమైన పరిణామాలు ఊపందుకున్నాయి. మతహింసకు సంఘ్ పరివార్ నుంచి అప్రకటిత ప్రోత్సాహం స్పష్టమైపోయింది. కొందరికి నిర్దాక్షిణ్యంగా తలుపులు మూసేస్తూ "అందరిదీ ఒకే కుటుంబం" అనడం వీరికి మాత్రమే చెల్లిన విద్య! ఈ కాలంలో ముస్లింలపై లవ్‌జిహాద్, గోవధ పేరుతో కొట్టిపారేయలేని హింస కొనసాగింది. క్రైస్తవ మతస్తులపై, వారి చర్చిలపై, మిషనరీలపై ఉన్మాద దాడులు పెరిగాయి. ప్రతి సంఘటన తర్వాత ప్రభుత్వం, ఆరెస్సెస్ నేతలు వాటిని ఖండించడానికి బదులు మౌనం వహించడం లేదా దోషులను రక్షించడం ఓ ధోరణిగా మారిపోయింది. భగవత్ ఆలోచనల్లో సంవిధానం కంటే 'మనుస్మృతి'కి దగ్గరగా ఉన్న విలువలే ప్రతిఫలించాయి. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) లాంటి నిర్ణయాలు ప్రత్యక్షంగా మైనార్టీలే లక్ష్యంగా సమాజంలో అనుమానాల గోడలు నిర్మించాయి. కశ్మీర్‌లో ప్రత్యేక హోదా రద్దుచేసి ప్రజాస్వామ్యాన్ని పక్కనబెట్టడం, మత పరమైన రాజకీయాలను గట్టిగా నిలబెట్టడం కూడా ఈ హయాంలోనే జరిగింది. ఒకవైపు "అఖండ భారత్" అనే నినాదం, మరోవైపు సమాజాన్ని ఖండ ఖండాలుగా విభజించే క్రూర ప్రవర్తన! ఫలితంగా దేశం శాంతి, సామరస్యాలతో అభివృద్ధి దిశగా ఐక్యంగా నడవాల్సిన సమయంలో భయభ్రాంతులు, అసహనం, అనుమానాలు పెరిగే వాతావరణం నెలకొంది. భగవత్ మృదుభాషణం, సంగీతాభిరుచి, పుస్తకపఠనం వంటి వ్యక్తిగత లక్షణాలను మోడీ రమణీయంగా వర్ణించారు. చదివితే ఒక సాహిత్య కథనంలా అనిపిస్తుంది. కానీ ఈ కాలంలో పెరిగిన మతవాదధోరణి, విభజనాత్మక వాతావరణం మోడీ వర్ణనలకు విశ్వసనీయతను అందిస్తాయా? "స్వచ్ఛ భారత్", "బేటీ బచావో" వంటి ప్రభుత్వ పథకాలతో భగవత్ అనుసంధానం చూపిస్తూ ఆరెస్సెస్‌ను ప్రజల శ్రేయోభిలాషిగా చిత్రించారు మోడీ. కానీ ఆ సంస్థ పట్ల దళిత, మైనారిటీ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకున్న భయాలు, వారి జీవితంపై నిత్యకృత్యమైన హింసాత్మక సంఘటనల మాటేమిటీ? మోడీ ప్రశంసల అద్దంలో ప్రతిబింబం మాత్రమే కనబడుతోంది, గాయాలు మొత్తం దాచబడ్డాయి. వ్యాసంలో ఎమర్జెన్సీ ప్రస్తావన ఉంది. "ఆ సమయంలో భగవత్ పోరాటం చేశారు" అని రాశారు. కానీ నిజమేమిటీ? ఆ సమయంలో ఆరెస్సెస్ చేసిన రాజీ ప్రయత్నాలు, మౌనవైఖరి, లొంగుబాటును చరిత్ర ఎత్తిచూపుతూనే ఉంది కదా. అందువల్ల వసుధ్కైక కుటుంబమనే భావన సంఘ్‌పరివార్‌కు ఏ మాత్రం గిట్టదనేది ఆచరణలో తేలుతున్న నిజం. భగవత్ హయాంలో ఆరెస్సెస్–బీజేపీ సాగిన మార్గం దేశం మొత్తాన్ని విభజన దిశగా నడిపింది. ఒక జాతి, ఒక మతం ఆధిపత్యం కోసం మిగతా వర్గాలను అణచివేయడమే విధానంగా నిలిచింది. "వసుధైక కుటుంబం" అనే సూత్రం మాటల్లో మాత్రమే మిగిలి, వాస్తవంలో అది 'విభజన, మతహింస, అసహనం' అనే కల్మషంతో మలినమై పోయింది. ఈ వ్యాసం ఒక సాదాసీదా ప్రశంస కాదు.

## గోదావరి తీరప్రాంతాల్లో

# పుష్కర ఏర్పాట్లు చేయండి

ఏకకాలంలో రెండులక్షల మంది స్నానాలు చేసేలా ఘాట్ల నిర్మాణాలు

శాశ్వత ప్రాతిపదికగా అభివృద్ధి పనులు..ఆలయాలనూ తీర్చిదిద్దండి

గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్ – ప్రజా స్వేచ్ఛ**

గోదావరి తీరప్రాంతాల్లో పుష్కరాల ఏర్పాట్లను శాశ్వత ప్రాతిపదికగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఏకకాలంలో రెండులక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. 2027 జులై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయనీ, ఇప్పటి నుంచి 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నాహకాలపై శుక్రవారంనాడిక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవిందహరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్కరాల ప్రణాళికల్ని అధికారులు సీఎంకు వివరించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీర ప్రాంతముందని తెలిపారు. దాదాపు 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరముంటుందని అధికారులు ముఖ్యమం త్రికి వివరించారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ గోదావరి తీరం వెంట ఏకకాలంలో రెండు లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించేలా ఘాట్ల నిర్మాణాలు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ధర్మపురి, కాళేశ్వరం వంటి ప్రధాన ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలనీ, పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. యాత్రీకులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలగడానికి వీల్లేదని, రోడ్ల నిర్మాణం మొదలు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలనీ, వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లు, వసతి సౌకర్యాలు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఆలయ కమిటీలు, అధికారులతో చర్చించాలనీ, మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవం ఉన్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలని చెప్పారు. గోదావరి తీరం వెంట ఉన్న అన్ని ఆలయాలనూ సందర్శించి వేర్వేరుగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేసుకోవాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛభారత్, జల్‌జీవన్ మిషన్ సహా అందుబాటులో ఉన్న అన్ని కేంద్ర పథకాలనూ సమన్వయం చేసుకుంటూ, నిధుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# గో బ్యాక్ మోడీ

–నిరసనలకు మణిపూర్ మహిళా సంఘాల పిలుపు

–బిజెపి నేతల మూకుమ్మడి రాజీనామా




**ఇంఫాల్ – ప్రజా స్వేచ్ఛ**

మణిపూర్‌లో నరమేధం, మహిళలపై తీవ్ర హింసను అడ్డుకోవడానికి ప్రయత్నించకపోగా, రెండేళ్ల నాలుగు నెలలపాటు మొఖం చాటేసి ఇప్పుడు పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి నిరసన తెలపనున్నట్లు రాష్ట్రంలోని ప్రముఖ మహిళా సంఘాలు ప్రకటించాయి. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ 'గో బ్యాక్ మోడీ' పేరిట శనివారం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న ట్లు తెలిపాయి. మోడీని కసాయిగా వర్ణించాయి. 'వర్కింగ్ గ్రూప్ ఆఫ్ మీరా పైబి' బ్యానర్ కింద వీధుల్లో ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపాయి. వర్కింగ్ గ్రూప్ ప్రధాన కార్యదర్శి అపాబీ లీమా ఇంఫాల్‌లో మాట్లాడుతూ 2023 మే 3 నుంచి రాష్ట్రంలో చెలరేగుతున్న హింసను పరిష్కరించడంలో ప్రధానమంత్రి విఫలమై నందున నిరసన తెలియజేయాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. హింసా కాండలో వందలాదిమంది మరణించారని, వేలాది మంది గాయాలు, లైంగిక హింసకు గురయ్యారని చెప్పారు. అనేకవేల మంది నిరాశ్రయులుగా మారి ఇప్పటికీ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారని గుర్తుచేశారు. 'హింసను అంతం చేయడానికి ఏమీ చేయకుండా.. రాష్ట్రంలో ఎందుకు పర్యటిస్తున్నారు? మణిపూర్ ను పూర్తిగా నాశనం చేయడానికి మరొక వ్యూహంతో వస్తున్నారా.?' అని ఆమె ప్రశ్నించారు. ఈ నిరసనల్లో 'మోడీ గో బ్యాక్', 'స్వీయ నిర్ణయాధికారం మా హక్కు', 'ఎఎఫ్ఎస్‌పిఎ ఒక వలస చట్టం', 'విభజించి పాలించే విధానాన్ని ఆపండి', 'మోడీ పర్యటనను వ్యతిరేకిస్తున్నాం' వంటి నినాదాలు చేయనున్నట్లు చెప్పారు. పీపుల్స్ ప్రొగ్రెసివ్ అలయన్స్ మణిపూర్ (పిపిఎఎం) నాయకులు కూడా మోడీ పర్యటనను వ్యతిరేకించారు. ఈ పర్యటనలో మోడీతో మహిళా సంఘాలు, పౌర సమాజ సంస్థల ప్రతినిధులు మాట్లాడానికి అవకాశం ఇవ్వకపోవడాన్ని ఖండించారు.

**ప్రచారం కోసమే మోడీ పర్యటన**

మోడీ పర్యటన కేవలం ప్రచారం కోసమేనని కాంగ్రెస్ విమర్శించింది. మణిపూర్ పిసిసి అధ్యక్షులు కిషమ్ మేఘచంద్ర ఒక వీడియో సందేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్ర ప్రజలు శాంతి, పునరావాసం, న్యాయం కోసం ఒక నిర్దిష్ట రోడ్‌మ్యాప్‌ను ఆశిస్తున్నారు. ఈ పర్యటనలో భాగస్వామ పక్షాలతో చర్చలు లేకపోవడం బాధాకరం' అని అన్నారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరామ్‌రమేష్ ఈ పర్యటన గురించి స్పందిస్తూ 'మణిపూర్‌లో మోడీ మూడు గంటల కన్నా తక్కువ సమయమే గడుపుతారు. శాంతి,సామరస్యం నెలకొల్పడానికి ప్రోత్సాహానికి బదులుగా, ఈ పర్యటన ఒక ప్రహసనంగా మారనుంది' అని పేర్కొన్నారు.

# విమానం టేకాఫ్.. రన్‌వేపై ఊడిన చక్రం..


### తర్వాత ఏమైందంటే..!




**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

సాధారణంగా విమానంలో ఏలోపం తలెత్తినా పెను ప్రమాదానికి దారితీస్తుంది. అందుకే విమానాల టేకాఫ్‌కు ముందు సుదీర్ఘ తనిఖీ ప్రక్రియ ఉంటుంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగినప్పటి నుంచి తనిఖీలు మరింత ఎక్కువయ్యాయి. ఏ చిన్న లోపం ఉన్నా టేకాఫ్‌కు ముందే విమానాలను నిలిపేస్తున్నారు. ఒకవేళ టేకాఫ్ అయిన తర్వాత సమస్యను గుర్తిస్తే వెంటనే తగుజాగ్రత్తలు తీసుకుని సేఫ్‌లాండ్ చేస్తున్నారు.ఇవాళ కాండ్లా నుంచి ముంబైకి వెళ్తున్న స్పైస్‌జట్ విమానానికి కూడా పెనుముప్పు తప్పింది. కాండ్లా ఎయిర్‌పోర్టు నుంచి విమానం టేకాఫ్ అయ్యింది. కానీ ఆ తర్వాత ఆ విమానం బయటివైపు చక్రం ఊడిపోయి రన్‌వేపై కనిపించింది. దాంతో పైలట్‌ను అప్రమత్తం చేసి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమనాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించారు. శుక్రవారం మధ్యాహ్నం 15.51 గంటలకు విమానం సురక్షితంగా ముంబై ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యింది. ఈ విషయాన్ని స్పైస్‌జట్ అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు.

# కోర్టు విచారణలకు గైర్హాజరు.. పోలీస్ అధికారికి గంట జైలు శిక్ష



**చండీగఢ్ – ప్రజా స్వేచ్ఛ**

కోర్టు విచారణలకు గైర్హాజరైన పోలీస్ అధికారిపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు గంట పాటు జైలు శిక్ష విధించారు. ఈ నేపథ్యంలో ఆ పోలీస్ అధికారి గంట సేపు జైలు శిక్షను అనుభవించారు. హర్యానాలోని కైతాల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 2021లో జరిగిన హత్య కేసుపై ఇన్‌స్పెక్టర్ రాజేష్ కుమార్ దర్యాప్తు చేశారు. ప్రస్తుతం సిర్సా జిల్లాలోని బడాబుధ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా ఆయన పనిచేస్తున్నారు.కాగా, పోలీస్ అధికారి రాజేష్ కుమార్ కోర్టు విచారణలకు పదే పదే గైర్హాజరయ్యారు. ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు ఆయన కోర్టుకు హాజరుకాలేదు. దీంతో ఆగస్టు 29న ఆ పోలీస్ అధికారిపై కోర్టు నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం సాక్ష్యం చెప్పేందుకు ఆయన కోర్టుకు వచ్చారు.మరోవైపు అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి మోహిత్ అగర్వాల్, దర్యాప్తు అధికారి ఇన్‌స్పెక్టర్ రాజేష్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టుకు పదే పదే గైర్హాజరైన ఆయనకు గంట పాటు జైలు శిక్ష విధించారు. కోర్టు ప్రాంగణంలోని సెల్‌లో గంట సేపు ఉంచాలని ఆదేశించారు. దీంతో యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ అధికారి రాజేష్ కుమార్‌ను గురువారం ఉదయం 10:30 నుంచి 11:30 వరకు కోర్టు ప్రాంగణంలో ఖైదీల కోసం ఏర్పాటు చేసిన కారాగారంలో ఉంచారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపర్చారు. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారిపై కోర్టు చర్యలు చర్చకు దారితీసింది.

# యంనంపేట్ రాంపల్లి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయండి:మీసాల రాజేష్



– ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి
మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి లో నత్త నడకగా నడుస్తున్న రోడ్డు పనులను ఆర్ అండ్ బి అధికారులు స్పందించి త్వరగా పూర్తి చేయాలని మీసాల రాజేష్ బిఆర్ఎస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్ అండ్ బి అధికారులను కోరారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల జాప్యం వల్ల వాహనదారులు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవలే కొంతమంది వాహనదారులు రోడ్డు గుంతలలో పడి గాయాల పాలు అయ్యారని ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని ఆయన అన్నారు.

# కూకట్పల్లిలో జోయాలుక్కాస్ రెండవ షోరూం ప్రారంభం

-నూతన షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
-హాజరైన కార్పొరేటర్ రోజాదేవి రంగారావు




కూకట్పల్లి,– ప్రజా స్వేచ్ఛ
వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఏ ఎస్ రాజు నగర్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన జోయలుకాస్ జ్యువెలరీ షో రూమ్ ను కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు ,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ సరికొత్త షోరూం ను ప్రారంభించడం ద్వారా మరొక మైలురాయిని చేరుకున్నామని అన్నారు. ప్రారంభ ఆఫర్ వ్యవధిలో ప్రతి కొనుగోలుపై ప్రతి కస్టమరు ఒక ఖచ్చితమైన ఉచిత బహుమతి లభిస్తుందని తెలిపారు.ప్రజలందరూ తమ షోరూమ్‌ను సందర్శించి నూతన డిజైన్లను ఆస్వాదించమని నిర్వాహకులు ఆహ్వానించారు.కార్యక్రమంలో ప్రముఖులు,సెలబ్రిటీలు, జోయాలుక్కాస్ గ్రూప్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



– ప్రజా స్వేచ్ఛ పెద్దమందడి/వనపర్తి జిల్లా ప్రతినిధి
పెద్దమందడిమండలం,అమ్మపల్లి గ్రామంలో పిడుగు రమేష్ చిన్న కుమారుడు ఇవాళ(శుక్రవారం) తెల్లవారు జామున . అనారోగ్యంతో మృతి చెందాడు. ఇట్టి విజయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు,గ్రామ కాంగ్రెస్ నాయకులు Rs 5000/- వారి కుటుంబానికి అందజేశారు. కుటుంబ సభ్యులు తూడి మేఘారెడ్డి కి కృతజ్ఞతలు తెలియ చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ బి. రమేష్ యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ గౌని వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సి. ఆంజనేయులు,బాలు, సి.యాదగిరి,పృద్వి కుమార్,పిడుగు సత్యన్న, నాగరాజు,బి. చెంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు




– ప్రజా స్వేచ్ఛ
12రామన్నపేట ప్రతినిధి
తెలంగాణ ఉన్నత విద్యా మండలి ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరం లో ప్రవేశాలు కల్పించే దోస్త్ (డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ) చివరి అవకాశం గా మరొక అవకాశాన్ని ప్రకటించింది అని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్ ఖానం తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత కలిగి డిగ్రీలో ప్రవేశం పొందని వారికి చివరి అవకాశం కల్పిస్తున్నారు ఈనెల 15,16 తేదీలలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆ రోజుల్లో నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు.స్పాట్ అడ్మిషన్ కొరకు పదవ తరగతి మెమో, ఇంటర్మీడియట్ మెమో కుల ధ్రువీకరణ,ఆదాయ ధ్రువీకరణ పత్రం 01 ఏప్రిల్ 2025 తేదీ తర్వాత తీసుకొని ఉండాలని తెలిపారు.మూడవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు,ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజ్ ఫోటో వెంట తీసుకొని రావాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ వాయిదా





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-15న కామారెడ్డిలో నిర్వహించాలని ఇంతకుముందు పీసీసీ నిర్ణయం**
**-భారీ వర్ష సూచన నేపథ్యంలో వాయిదా**
**-సభ నిర్వహణ తేదీని మళ్లీ ప్రకటిస్తాం**
**-పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్**

కామారెడ్డి/– ప్రజా స్వేచ్ఛ
టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ వాయిదా పడింది. కామారెడ్డి సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో ఈ సభను వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మరోవైపు.. రెండు రోజులుగా కామారెడ్డిలోనే ఉంటూ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి సీతక్క సైతం ఇదే విషయాన్ని వెల్లడించారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని కార్యకర్తలతో శుక్రవారం ఆమె సమావేశం కాగా, టీపీసీసీ నుంచి అందిన సమాచారం మేరకు సభ వాయిదా పడినట్లు తెలిపారు.

**కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదు: సీతక్క**

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని మంత్రి సీతక్క అన్నారు. ఎమ్మెల్యేల డీఎన్ఏపై కేటీఆర్ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలను బీఆర్ఎసలో చేర్చుకున్న సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వచ్చారన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి బీసీలకు బీఆర్ఎస్ ఏం చేసిందని నిలదీశారు.

# ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలి

పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గోశిక వెంకటేష్



– ప్రజా స్వేచ్ఛ
రామన్నపేట ప్రతినిధి
చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గోషిక వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికుల వద్ద నుండి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వస్త్రాలు కొనుగోలు చేయడం లేదన్నారు. చేనేత మగ్గాల మీద ఆధారపడి జీవించే కార్మికులు చావే శరణ్యంగా భావించి వందకు పైగా కార్మికులు చనిపోయారన్నారు. కార్మికులకు పనులు లేక కూరగాయల దుకాణాలు, వాచ్మెన్ లుగా, చిరు ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగించే పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు అంగన్వాడీ కేంద్రాల్లో నెలలో 8 రోజులు చేనేత వస్త్రాలు ధరించే విధంగా ప్రకటన విడుదల చేయాలన్నారు. వెంటనే పద్మశాలి సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మారుతి సుజుకి అల్ న్యూ విక్టరిస్ నూతన కారు మార్కెట్లో విడుదల

ముఖ్య అదితిగా కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి




శేరిలింగంపల్లి – ప్రజా స్వేచ్ఛ
మదీనా మైత్రీ నగర్ కమాన్ వద్ద మారుతి సుజుకి అల్ న్యూ విక్టరిస్ నూతన కారు ప్రారంభోత్సవం సాయి సర్వీస్ మారుతి సుజుకి మియాపూర్ షోరూమ్ లో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు గా కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందా నగర్ కార్పొరేటర్ మంజుల రఘు నాథ్ రెడ్డి ప్రాథీబాన్ రీజినల్ మేనేజర్ మారుతి సుజుకి ఉదయ్ కులకర్ణి, సీఈవో సాయి సర్వీస్ గిరి బాబు సేల్స్ సాయి సర్వీస్ సిబ్బంది , కస్టమర్స్ పాల్గొన్నారు. ఈ కారు ఎన్నో అధునాతన పిచర్స్ కలిగి ఉంది ఆటోమేటిక్ ట్రాన్స్మిషన్ మనువల్ ట్రాన్స్మిషన్ స్ట్రాంగ్ హైబ్రిడ్ నా క్యాప్ 5 స్టార్ రేటింగ్ పొందినది ఈ కారు లెవెల్ 2 అదాస్ పిచర్స్ కలిగి వస్తుంది. అత్యాధునిక హంగుల తో మార్కెట్లో గర్వంగా విడుదల చేస్తున్నాం అని తెలిపారు.

# బున్యాదిపురం గ్రామంలో మంచినీటి సమస్య పై స్పందించిన

తూడి మెగారెడ్డి ఎమ్మెల్యే





– ప్రజా స్వేచ్ఛ
.పెబ్బేరు/వనపర్తి. జిల్లా ప్రతినిధి.
పెబ్బేరు మండలం,బునియాదిపురం గ్రామంలోని, ఎస్సీ కాలనీలో గల మోటార్ చెడిపోవడంతో, బీసీ కాలనీలో మంచినీటి సమస్య ఏర్పడగా ఇట్టి సమస్యపై బునియాధి పురం కాంగ్రెస్ నాయకులు నీటి సమస్యను ఎంపీడీవో రోజా దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. వెంటనే ఎంపీడీవో, ఎమ్మెల్యే మేగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, కొత్త మోటారును మరియు స్టార్టర్ ను ఇప్పించి, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. అట్టి కొత్త మోటారును గ్రామ కాంగ్రెస్ నాయకులు దగ్గరుండి ఫిట్ చేయించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆంజనేయులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోరి నరేందర్, వనం మల్లేష్ యాదవ్,శ్యాంసుందర్ ,గుడిసె మహేష్,రామకృష్ణ గ్రామపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ ప్రజలు, తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే గార్కి ధన్యవాదాలు తెలిపారు.

# ముత్తంగి బుడగ జంగాల సంఘం అధ్యక్షునిగా సదుల విఠల్ నియామకం




– ప్రజా స్వేచ్ఛ
శేరి లింగంపల్లి ప్రతినిధి
తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి గ్రామం నందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి రాష్ట్ర బుడగ జంగాల సంఘం అధ్యక్షులు చింతల రాజలింగం రాష్ట్ర నాయకులు కప్పరి రమేష్, నూనె నరసింహ, స్థానిక నాయకులు సదుల ఎమ్మానియెల్, తూర్పటి పెంటయ్య, సిరివటి దస్తయ్య, పాస్తాం శ్రీ రామ్, సదుల శివ శంకర్ తదితరులు పాల్గొనడం జరిగింది ఈ సమావేశంలో ముత్తంగి బుడగ జంగా ల సంఘం గ్రామఅధ్యక్షుడిగా సదుల విఠల్ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సదుల విఠల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నన్ను ఎన్నుకున్నందుకు అందరికీ అందుబాటులో ఉండి సంఘానికి అన్ని వేళలో సేవ చేయడానికి ఉంటానని చెప్పడం జరిగింది. అవకాశం కల్పించిన అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# మెట్ పల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంగా బోర్డు ఏర్పాటు చేయండి



**మెట్ పల్లి – ప్రజా స్వేచ్ఛ**

మెట్ పల్లి నియోజకవర్గ సాధన కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు రెవెన్యూ డివిజన్ మండల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో మెట్ పల్లి గత చరిత్ర ఆధారంగా చేసుకుని మేము చేసిన ఉద్యమాలను పరిగణములోకి తీసుకొని ప్రభుత్వం 2017 సంవత్సరంలో మెట్ పల్లి ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయడం జరిగింది. మరింత పరిపాలన అందించడానికి ఆగస్టు 2019 సబ్ కలెక్టర్ కార్యాలయంగా అభివృద్ధి చేశారు. కానీ ప్రస్తుతం మెట్ పల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం బోర్డును తొలగించి రెవెన్యూ డివిజన్ కార్యాలయంగా బోర్డును ఏర్పాటు చేశారు. ఇట్టి విషయమై మెట్ పల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంగా బోర్డును పునర్దించి మరియు మెట్ పల్లి లో ఐఏఎస్ అధికారులను ఏర్పాటు చేయాలని ప్రధాన డిమాండ్ తో మెట్ పల్లి డివిజన్ ప్రజల మనో భావాలను కాపాడాలని కోరుతూ ఈరోజు మెట్ పల్లి రెవిన్యూ డివిజన్ ఏవో అధికారి విజయ లలితా గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి నియోజకవర్గ సాధన కమిటీ అధ్యక్షులు తోకల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు గట్టయ్య, గోరుమంతుల సురేందర్, ఫోట్ట ప్రేమ్, దేశరాజ్ దేవలింగం, పుల్ల రాజా గౌడ్, గుంజేటి రాజరత్నాకర్, నీరటి రాజేందర్, అచ్చ లింగం, గంప శ్రీనివాస్, గుర్రాల విక్రమ్, సజ్జన పవన్ కుమార్, అరవింద్, పాల్గొన్నారు.

# నేషనల్ సైన్స్ సెమినార్ లో క్రిష్ణవేణి విద్యార్థి జిల్లా స్థాయి ప్రథమ బహుమతి

## రాష్ట్ర స్థాయికి ఎంపిక



**– ప్రజా స్వేచ్ఛ రామన్నపేట ప్రతినిధి**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్ లో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి రిమ్ షా సదాఫ్ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి కి ఎంపికైనట్లు పాఠశాల క్యారెస్పండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్ లో జిల్లా వ్యాప్తంగా 24 పాఠశాలలు పాల్గొనగా రామన్నపేట క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి రిమ్ షా సదాఫ్ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి కి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ ప్రకటించినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి సెమినార్ లో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థి రిమ్ షా ను, గైడ్ టీచర్ పి.మురళిని పాఠశాల ప్రిన్సిపాల్ బి. యాదగిరి, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి, పాఠశాల ఉపాధ్యాయులు రషీద్, శ్రీనివాస్, మల్లేష్, అలీం,ప్రవీణ్, పూనం దాస్, ఉమారాణి,లక్ష్మీదేవీ, మహాలక్ష్మీ,లావణ్య,వినోద, ఫరియా,విజయలక్ష్మి, కరుణ, శ్రావణి,మమత తదితరులు అభినందించారు.

# నిజాంపేట్ లో మెగాయూజ్డ్ కార్స్ ఎక్స్ఛేంజ్ మేలా




**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి(అశోక్)**

హర్ష టయోటా మెగా యుజ్డ్ కార్స్ ఎక్స్ఛేంజ్ మేళ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హర్ష టయోటా మేనేజర్ రాజశేఖర్ యు.ట్రస్ట్ జిఎం సేల్స్ మేనేజర్ కృష్ణారెడ్డి. మార్కెటింగ్ మేనేజర్ శ్రీకర్ పి పాల్గొన్నారు. ఆఫర్ 10000 సెప్టెంబర్ 12. 13 .14. అడిషనల్ ఆఫర్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొలం రాజశేఖర్ రెడ్డి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ పాల్గొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని హర్ష టయోటా మేనేజర్ అండ్ సేల్స్ మేనేజర్స్ ఈ సందర్భంగా తెలిపారు.

# బిజెపి,బిఆర్ఎస్ తోడుదొంగలే...

- -ఎంపీగా గెలిస్తే షుగర్ ఫ్యాక్టరీ కట్టిస్తా అని అన్నా ధర్మపురి అరవింద్ ఎక్కడ..?
- -షుగర్ ఫ్యాక్టరీలు తెరవడానికి ప్రణాళిక సిద్ధం చేసింది కాంగ్రెస్ పార్టీ..
- -ముత్యంపేట్ షుగర్ ఫ్యాక్టరీకి 175 కోట్ల బకాయిలు కట్టినది కాంగ్రెస్ ప్రభుత్వం..
- -అవగాహన లేకుండా మాట్లాడి జిల్లా అధ్యక్ష పదవిని నవ్వులపాలు చేయకు యదగిరిబాబు
- -రాష్ట్ర కిసాన్ సెల్ జాయిన్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి...



**మెట్ పల్లి – ప్రజా స్వేచ్ఛ**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ డెలిగెట్ కల్వకుంట్ల సుజిత్ రావు ఆదేశాలతో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అధ్యక్షతన రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ సత్యం రెడ్డి తన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...నిన్న జరిగిన బీజేపీ మీడియా సమావేశంలో యాదగిరి బాబు మాట్లాడిన మాటలన్నీ వట్టి మాటలేనని,మొదటిసారి ఎంపీగా గెలిస్తే షుగర్ ఫ్యాక్టరీ కట్టిస్తా అని అన్నా ధర్మపురి అరవింద్ ఎక్కడ అని ప్రశ్నించారు. తిరిగి మరో మారు ఎన్నికల స్టంట్ గా షుగర్ ఫ్యాక్టరీ తెరపైకి తెచ్చి రైతులను మోసం చేసి ఎంపీగా గెలిచిన అరవింద్ షుగర్ ఫ్యాక్టరీ పట్టించుకోలేదని అన్నారు. అప్పటి పాదయాత్రలో భాగంగా రేవంత్ రెడ్డి షుగర్ ఫ్యాక్టరీ వద్ద బస చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి షుగర్ ఫ్యాక్టరీలు తెరవడానికి ప్రణాళిక సిద్ధం చేసి దానికి ఒక కమిటీని నియమించి ఏకకాలంలో ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడానికి పది సంవత్సరాలుగా ఉన్న బకాయిలలో 175 కోట్ల బకాయిలు చెల్లించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఉద్ఘాటించారు. అసలు షుగర్ ఫ్యాక్టరీ గురించి ఎటువంటి అవగాహన లేకుండా మాట్లాడి జిల్లా అధ్యక్ష పదవికి యాదగిరి బాబును రైతులు, ప్రజల ముందు నవ్వుల పాలు కావద్దని వాకిటి సత్యం రెడ్డి హితవు పలికారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించే విషయంలో మాట ఇచ్చి ప్రజలను మోసం చేసిందని బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిన విషయం రైతులు మర్చిపోలేదని,రైతులపై టిఆర్ఎస్ ప్రభుత్వం మోపిన కేసులను సైతం రైతులు మర్చిపోలేదన్నారు. అంతేకాకుండా ఖచ్చితంగా నన్ను భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ నియోజకవర్గ ఎంపీగా నన్ను గెలిపిస్తే నేను షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని ప్రభుత్వాన్ని ఒప్పించి తెరిపించకపోతే నా సొంత డబ్బులతో షుగర్ ఫ్యాక్టరీని నేనే కట్టిస్తానని ఎంపి అరవింద్ చేసిన వాగ్దానం చేసిన మాట నిజం కాదా అని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీ,బిజెపి పార్టీ రెండు పార్టీలు ప్రజల్ని మోసం చేస్తేనే గుణపాఠంగా రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని,ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మాటమీద నిలబడ్డదని దానిని ఓరువలేని తనంతో కాంగ్రెస్ ప్రభుత్వం పై బురదల్లే కార్యక్రమాల్ని మానుకోవాలని హితువు పలుకారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షాన,ప్రజల కొరకు పని చేస్తుందని త్వరలోనే షుగర్ ఫ్యాక్టరీని తెరిపించుకొని రైతుల కళ్ళల్లో ఆనందం చూసే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుందని మీరెన్ని అబద్ధపు మోసపూరిత మాటలు చెప్పిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని రైతులెప్పుడూ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబోదీన్ పాషా,రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి, మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ముల చిన్నారెడ్డి,కాంగ్రెస్ నాయకులు కల్లెడ గంగాధర్,సింగరపు అశోక్,శంకర్,గణేష్,కోరే రాజ్ కుమార్, శ్రీలోక్,రంజిత్, అన్వర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన డ్రైన్ ఏర్పాటు తో కాలనీలో వరద సమస్యకు పరిష్కారం

## -ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

**ప్రజా స్వేచ్ఛ ఎల్ బి నగర్ నియోజకవర్గ ప్రతినిధి**

రెండు రోజులు గా కురిసిన వర్షాలకు గాను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారాకాలనీ లో శుక్రవారం పర్యటించారు ఈ సందర్భంగా బస్తివాసులు మాట్లాడుతూ పక్కనే ఉన్న స్మశానవాటిక నందు వర్షపునీరు నిండిపోయి వరదనీరు బంజారాకాలనీ లోని కొన్ని రోడ్లను ముంచెత్తింది అని అన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో పడ్డ భారీ వర్షాలకు గాను ఇక్కడ ఒక డ్రైన్ కట్టడం జరిగింది. దానివల్ల దాదాపు 15 కాలనీవాసులకు వరదనీటి సమస్యల నుంచి పూర్తిస్థాయిలో విముక్తి లభించింది అని తెలిపారు ప్రస్తుతానికి ఇట్టి వరదనీటి సమస్యల కోసం నూతన డ్రైన్స్ మంజూరు చేయడం జరిగింది అని గుర్తు చేశారు ప్రస్తుతానికి తాత్కాలిక సమస్యల్లో భాగంగా



కొంత మేర గోడ కూలగొట్టి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తామని అన్నారు. ఎక్కడ గోడ తొలగించాలో కాలనీవాసులు నిర్ణయం తీసుకున్న తర్వాత అట్టి గోడ కులగొట్టి వరదనీరు డ్రైన్స్ లోకి పంపడం జరుగుతుంది అని సూచించారుఅతి త్వరలోనే నూతన డ్రైన్స్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం జరుగుతుంది అని పనులు సకాలంలో పూర్తి అయితే పద్మావతి కాలనీ,హయత్ నగర్ బస్ డిపో,కోర్టు,హయత్ నగర్ ప్రధాన రహదారిపై వర్షపునీరు నిల్వకుండా ఉంటుంది అన్నారు ఈ



కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్,భాస్కర్ సాగర్, అధికారులు హేము నాయక్,సురేష్,నాయకులు రాకేశ్,లక్ష్మణ్,ఇంద్రకరణ్ రెడ్డి,మధు ముదిరాజ్, మనోజ్,అంజమ్మ,శంకర్ నాయక్,దేవరం, మోహన్,ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి లో నిర్వహించే బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలి...

- -గత ప్రభుత్వ పాలకుల వల్ల బీసీలు మరింత వెనుకబడ్డారు..
- -కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లు ఆమోదించకపోవడంతోనే అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెట్టాం

**కామారెడ్డి జిల్లా**
**– ప్రజా స్వేచ్ఛ**

ఈనెల లో కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే బీసీ డిక్లరేషన్ సభకు లక్షలాదిమంది అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్ లు అన్నారు. శుక్రవారం కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి, పాల్వంచ మండలాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ కులాల జనగణనతో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు తేల్చిందని అన్నారు. అత్యధికంగా ఉన్న బీసీలను దృష్టిలో ఉంచుకొని కనీసం 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అందించాలని ఉద్దేశంతో కామారెడ్డి లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్ హామీని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి కేంద్రనికి సిఫార్సు చేసిందని





అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలపై వివక్ష చూపి అమలు చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. ఏదో సాకుతో బీసీల కు న్యాయంగా కల్పించే రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే జరిపి బీసీల లెక్కను తేల్చకుండానే వారికి అన్యాయం చేసిందని అన్నారు. టబీ ఆర్ఎస్, బిజెపి పార్టీలు రెండు ఒకటేనని అన్నారు బీసీలపై కపట ప్రేమ చూపుతూ వారికి న్యాయంగా లభించే స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగ రంగాలలో పరోక్షంగా అడ్డుకుంటుందని అన్నారు. దళితులకు బీసీలకు కాంగ్రెస్ పార్టీతోనే సముచిత న్యాయం జరుగుతుందని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం హామీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలను అర్హులకు అందించడమే లక్ష్యంగా పనిచేసి అమలు చేయడంలో ముందుంది అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కి భరోసా అందిస్తే వారికి వెంట అంటూ ఉంటుందని గుర్తు చేశారు. బహుజనుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పనిచేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశలోకి తీసుకెళ్తుందని అన్నారు. ఈనెల లో కామారెడ్డి లో నిర్వహించే బీసీ డిక్లరేషన్ సభకు లక్షలాది మందితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సభను విజయవంతం చేసేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారీగా పెరిగిన బంగారం ధరలు..
# హైదరాబాద్‌లో తులం ఎంతంటే..?

**హైదరాబాద్**

బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. రోజురోజుకు పసిడి ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. అమాంతం పెరిగిన ధరలతో పసిడి ప్రియులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రికార్డు స్థాయిలో ధరలు పెరిగిపోవడంతో ఇవేం ధరలు బాబోయ్ అని అంటున్నారు. హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు భారీగా పెరిగిపోయాయి. హైదరాబాద్ నగరంలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,02,000 ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,11,280గా ఉంది. నిన్నటి ధరలతో పోల్చితే 22 క్యారెట్ల గోల్డ్ రూ. 700 ఎగబాకగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 771 ఎగబాకింది. దీంతో గోల్డ్ లవర్స్ ఆగమైపోతున్నారు. ఈ స్థాయిలో ధరలు పెరిగితే బంగారం కొనేదెలా అని



ప్రశ్నించుకుంటున్నారు. ఇక ఈ ఏడాది ఆరంభంతో ఈ ధరలను పోల్చితే.. నేటికి 42 శాతం రెట్టింపు అయ్యాయి గోల్డ్ రేట్స్. జనవరి నెలలో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 71,500 ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 78 వేలు ఉండే. కానీ ఇప్పుడు ఆ ధరలు 42 శాతం జంప్ కావడంతో బంగారం ప్రియులు లబోదిబోమంటున్నారు.

## ఎల్ఐసీకి కష్టకాలం..
### 70 శాతం వరకు కోల్పోయిన పెట్టుబడులు
### ఏడాదిలో 15 శాతం తగ్గిన షేర్ విలువ

**న్యూఢిల్లీ,**

బీమా దిగ్గజం ఎల్ఐసీ కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నది. గడిచిన ఏడాదికాలంలో కంపెనీ షేర్లు 15 శాతం వరకు తగ్గగా, అలాగే సంస్థ పెట్టుబడులు పెట్టినదాంట్లో 70 శాతం సంస్థల షేర్లు 70 శాతం వరకు నష్టపోయాయి. తాజాగా ట్రెండ్లీనే విడుదల చేసిన డాటాలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. గతేడాది సెప్టెంబర్‌లో 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నదాంతో పోలిస్తే ప్రస్తుతం కంపెనీ షేరు 20 శాతం నష్టపోయింది. అలాగే ఈ ఏడాది మార్చిలో 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.715.30కి పడిపోయిన విలువ ప్రస్తుతం ఈ భారీ నష్టాల నుంచి కోలుకున్నది. గడిచిన 200 రోజుల సరాసరి షేరు ధర రూ.865 స్థాయిలో ఉన్నది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.2,25,451 కోట్ల ఆదాయంపై రూ.10,957 కోట్ల నికర లాభాన్ని గడించింది. కంపెనీ షేరు ధర రూ.850 నుంచి రూ.920 మధ్యలోనే స్వల్పకాలం పాటు కొనసాగనున్నదని, భవిష్యత్తులో రూ.1,000 మార్క్‌కు చేరుకునే అవకాశం ఉన్నదని దలాల్‌స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. గడిచిన ఏడాదికాలంలో కంపెనీ పెట్టుబడులు పెట్టిన 186 సంస్థల షేర్లు 70 శాతం వరకు నష్టపోయాయి. వీటిలో 150 సూచీలు రెండంకెల స్థాయిలో పతనాన్ని మూటగట్టుకున్నాయి. వీటిలో వీఎల్ ఈ-గవర్నెన్స్ అండ్ ఐటీ సొల్యూషన్స్, ఫ్లెక్సిటఫ్ వెంచర్స్ ఇంటర్నేషనల్, ఈజీ ట్రిప్ ప్లానర్స్, జైప్రకాశ్ అసోసియేట్, వాక్రెంజ్, సిమెన్స్, జై కార్ప్ షేర్లు 50 శాతానికి పైగా నష్టపోయాయి. 13 షేర్లు 40 శాతం నుంచి 50 శాతం వరకు పతనం చెందాయి. వీటిలో పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, అదానీ గ్రీన్ ఎనర్జీ, ఇండస్‌ఇండ్ బ్యాంకులు ఉన్నాయి.

## నాలుగున్నర ఎకరాలకు రూ.3,472 కోట్లు
### ముంబయిలో భూమి కొనుగోలు చేసిన ఆర్‌బిఐ

**ముంబయి**


రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల దక్షిణ ముంబయిలోని నారీమన్ పాయింట్ ప్రాంతంలో వేల కోట్ల రూపాయలు చెల్లించి 4.61 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ముంబయి మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఏకంగా రూ.3,472 కోట్లు చెల్లించి దీన్ని స్వాధీనం చేసుకోవడం విశేషం. ఈ ప్రాంతం మంత్రాలయ, బాంబే హైకోర్టు, కొన్ని కార్పొరేట్ హెడ్‌క్వార్టర్లకు సమీపంలో ఉండటంతో ఇక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ భూమిని తొలుత వేలం వేయాలని ముంబయి మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ తొలుత భావించింది. పలు పరిణామాలతో ఈ టెండర్ రద్దుకావడంతో ఆ స్థలాన్ని ఆర్‌బిఐ దక్కించుకుంది.




తమ ప్రధాన కార్యాలయం విస్తరణకు ఈ స్థలాన్ని ఉపయోగించుకోవాలని భావించింది. దీనికి సంబంధించి సెప్టెంబర్ 5న రిజిస్ట్రేషన్ కాగా.. ఇందుకోసం రూ.208 కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లించినట్లు సమాచారం. ముంబయిలో ఇదే అత్యంత ఖరీదైన భూమి ఒప్పంద విక్రయమని తెలుస్తోంది.

## ఆసియా కప్ ప్రమోషన్‌లో
# పాకిస్థాన్ లోగో మాయం..
### పంజాబ్ కింగ్స్ ఎందుకిలా చేసిందంటే..!

ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఇంకా రెండు రోజులే ఉంది. సెప్టెంబర్ 14న దాయాది జట్లు నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఇరుజట్ల మధ్య జరుగతున్న తొలి మ్యాచ్ ఇది. అయితే.. పాక్‌తో మ్యాచ్‌కు బీసీసీఐ పచ్చజెండా ఊపడాన్ని చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు. మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్లు చేస్తున్నవారు కొందరైతే.. పాక్ పేరు లేకుండా పోస్టులు పెడుతున్నారు మరికొందరు. ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ సైతం అలాంటి పోస్ట్‌తోనే ప్రస్తుతం వార్తల్లో నిలిచింది. ఆతిథ్య యూఏఈ పై భారీ విజయంతో ఆసియా కప్‌ను ఆరంభించింది భారత జట్టు. గ్రూప్ దశలో సూర్యకుమార్ యాదవ్ సేన ఆడబోయే తదుపరి




మ్యాచ్ పాకిస్థాన్‌తోనే. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగబోయే ఈ గేమ్‌పైనే అభిమానులందరి దృష్టి ఉంది. ఈ నేపథ్యంలో భారత్, పాక్ మ్యాచ్ ప్రచారాన్ని పంజాబ్ కింగ్స్ జట్టు వినూత్నంగా చేస్తోంది. పాక్ జట్టు పేరు, ఆ టీమ్ లోగో ముద్రించకుండానే టీమిండియ రెండో మ్యాచ్ అంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది పంజాబ్ యాజమాన్యం. 'ఆసియా కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టుకు రెండో మ్యాచ్. లెట్స్ గో' అంటూ టీమిండియా విజయాన్ని కాంక్షించింది పంజాబ్. అయితే.. ఆ పోస్ట్‌లో భారత్ వర్సెస్ పాక్ అని ఉండాలి. కానీ, ప్రత్యర్థి పేరు, లోగో స్థానాన్ని ఖాళీగా ఉంచి పాక్‌పై తమ అయిష్టతను వ్యక్తం చేసింది ఐపీఎల్ రన్నరప్. పంజాబ్‌కు చెందిన ఆటగాళ్లు పాక్‌తో క్రికెట్ వద్దే వద్దని అంటున్నారు. జలంధర్ వాస్తవ్యుడైన హర్భజన్ సింగ్ దాయాదితో క్రికెట్, వ్యాపారం అన్ని ఆపేయాలని డిమాండ్ చేశాడు. 'భారత్ పాకిస్థాన్ మ్యాచ్ ఎల్లప్పుడూ అభిమానులను ఆకర్షిస్తూనే ఉంటుంది. కానీ, ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిణామాలు మారిపోయాయి. దేశంలోని ప్రతి ఒక్కరూ ఇకపై పాక్‌తో క్రికెట్, వ్యాపారం ఏవీ వద్దనుకుంటున్నారు' అని భజ్జీ మీడియాతో వెల్లడించాడు.

# స్పోర్ట్స్

## సెమీఫైనల్లో సాత్విక్ -చిరాగ్..
### తొలి వరల్డ్ టూర్ టైటిల్ దక్కేనా..!



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో మెరిసిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జోడీ మరో టైటిల్ వేటకు చేరువైంది. ప్రతిష్ఠాత్మక హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఈ స్టార్ జంట సంచలన ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం హెూరాహెూరీగా జరిగిన మూడు సెట్ల పోరులో జునైదీ అరిఫ్ -రాయ్ కింగ్ యాప్ (మలేషియా)లను చిత్తు చేసింది. దాంతో.. వరుసగా రెండో టోర్నమెంటల్‌లో సెమీస్ బెర్తు కైవసం చేసుకుందీ భారత స్టార్ ద్వయం. హాకాంగ్ ఓపెన్‌లో సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్ శెట్టి జోడీ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. 42వ ర్యాంక్ జోడీని మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్ చేరిన ఈ ద్వయం అదే దూకుడు చూపించింది. బలమైన ఆటాకింగ్‌తో భారత జంటకు చెక్ పెట్టాలని భావించిన జునైదీ అరిఫ్ - రాయ్ కింగ్ యాప్‌లకు చుక్కలు చూపించింది. ప్రత్యర్థి ఎత్తుల్ని చిత్తు చేస్తూ తొలి సెట్‌ను సాత్విక్ -సాయిరాజ్ 21-14తో కైవసం చేసుకున్నారు. అయితే.. రెండో సెట్‌లో అటాకింగ్ గేమ్‌తో మలేషియా షట్లర్లు 22-20తో పైచేయి సాధించారు. దాంతో.. మూడో సెట్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. నిర్ణయాత్మకమైన ఈ సెట్‌లో సాత్విక్ -చిరాగ్ జోడీ టాప్ గేర్‌లో ఆడింది. తమదైన శైలిలో దూకుడు కనబరిచి జునైదీ - రాయ్ కింగ్ జంట సెమీస్ ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఏడాది తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ వేటలో ఉన్న ఈ జోడీ శనివారం లిన్ బింగ్ వీ - చెన్ చెంగ్ కౌన్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది.

# పాక్ శుభారంభం.. ఒమన్‌పై ఘన విజయం

**దుబాయ్**

ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ టోర్నీలో పాకిస్థాన్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన గ్రూపు-ఏ లీగ్ మ్యాచ్‌లో పాక్ 93 పరుగుల తేడాతో పసికూన ఒమన్‌పై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా..బ్యాటింగ్ వైపు మొగ్గుచూపాడు. యువ బ్యాటర్ మహమ్మద్ హరిస్(43 బంతుల్లో 66, 7ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీతో పాక్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 160/7 స్కోరు చేసింది. షా ఫైజల్(3/34), అమీర్ కలీమ్(3/31) మూడేసి వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ 16.4 ఓవర్లలో 67 పరుగులకు కుప్పకూలింది.

**హరిస్ ఒక్కడే:**

మొదట బ్యాటింగ్‌కు దిగిన పాక్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ సయిమ్ ఆయూబ్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఫైజల్ బౌలింగ్‌లో వికెట్ల ముందు



అడ్డంగా దొరికిపోయిన ఆయూబ్..డీఆర్ఎస్‌కు వెళ్లినా లాభం లేకపోయింది. దీంతో నాలుగు పరుగులకే పాక్ తొలి వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ ఫర్హాన్(29) రెండు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కలీమ్ క్యాచ్ విడిచిపెట్టడంతో బతికిపోయాడు. ఫర్హాన్, హరిస్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. బౌండరీల రాక మందగించగా, హరిస్ 14 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అయితే ఆమిర్ వేసిన ఆరో ఓవర్‌లో ఫర్హాన్ ఫోర్‌కు తోడు హరిస్ ఫోర్, సిక్స్‌తో 16 పరుగులు వచ్చి చేరడంతో పవర్‌ప్లే ముగిసే సరికి పాక్ 47/1 స్కోరు చేసింది. ఫర్హాన్‌ను అండగా చేసుకుంటూ హరిస్ బ్యాటు ఝులిపించే ప్రయత్నం చేశాడు. పసలేని ఒమన్ బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో ఓ భారీ సిక్స్‌తో 32 బంతుల్లో హరిస్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్న తరుణంలో ఫర్హాన్..కలీమ్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇదే అదనుగా బౌలింగ్ మార్పుగా వచ్చిన కలీమ్ 13వ ఓవర్‌లో వరుస బంతుల్లో హరిస్‌తో పాటు కెప్టెన్ సల్మాన్ ఆగా(0)ను ఔట్ చేసి ఒమన్ శిబిరంలో ఆనందం నింపాడు. ఆ తర్వాత హసన్ నవాజ్(9), అష్రఫ్(8) విఫలం కాగా, జమాన్(23 నాటౌట్), నవాజ్(19) అంతోఇంతో బ్యాటు ఝులిపించడంతో పాక్‌కు గౌరవప్రదమైన స్కోరు దక్కింది.




# హార్రర్ ప్రాంచైజీ కాంచన 4 వచ్చేస్తుంది..

## రాఘవా లారెన్స్ టీం క్రేజీ న్యూస్..!

---

కోలీవుడ్ నుంచి వచ్చి తెలుగులో కూడా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న హార్రర్ ప్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది కాంచన. రాఘవా లారెన్స్ స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్స్‌లో నటించిన ఈ ప్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. కాగా తెలుగు, తమిళ ప్రేక్షకులకు ఓ వైపు వినోదం అందిస్తూనే.. మరోవైపు గూస్ బంప్స్ తెప్పించేందుకు కాంచన 4 కూడా వచ్చేస్తుంది. కోలీవుడ్ సర్కిల్ కథనం ప్రకారం కాంచన 4 చిత్రీకరణ సగభాగం పూర్తయింది.రాఘవా లారెన్స్ టీం వీలైనంత త్వరగా కాంచన 4 ప్రొడక్షన్ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. ఈ చిత్రానికి రాఘవా లారెన్స్ డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. కాంచన 4లో బాలీవుడ్ భామ నోరా ఫతేహి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది నోరా ఫతేహి. పూజా హెగ్డే, రష్మిక మందన్నా కూడా కాంచన 4లో టీంతో జాయిన్ కాబోతున్నట్టు వార్తలు వస్తుండగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా కాంచన 3 మిక్స్ రివ్యూస్ వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది.కాంచన 3 తెలుగులో నాని నటించిన జెర్సీ చిత్రానికి బాక్సాఫీస్ వదదగట్టి పోటీనివ్వడమే కాదు సుమారు 100 కోట్ల వరకు వసూల్లు రాబట్టింది. మరి కాంచన 4 ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# మిరాయి హీరోయిన్‌కు ఈ స్టార్

## హీరోతో రొమాన్స్ చేయాలనుందట..!



విశ్వక్‌సేన్ నటించిన అశోకవనంలో అర్జుణ కళ్యాణం చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది రితికా నాయక్. ఈ ఢిల్లీ బ్యూటీ ఆ తర్వాత నాని నటించిన హాయ్ నాన్నలో అతిథి పాత్రలో మెరిసింది. తాజాగా తేజ సజ్జా హీరోగా నటించిన ఫాంటసీ డ్రామా మిరాయి సినిమాతో మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిసింది. ఈ చిత్రం బాక్సాపీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంటోంది. కాగా రితికా నాయక్ మిరాయి ప్రమోషన్స్‌లో తనకు సిల్వర్ స్క్రీన్‌పై ఎవరితో రొమాన్స్ చేయాలనుందో చెప్పేసింది.తాను అల్లు అర్జున్‌ను ఎంతో అభిమానిస్తానని చెప్పిన రితికా నాయక్.. నాకైతే అల్లు అర్జున్‌తో కలిసి నటించాలని ఉంది. సినిమా ఎలాంటిదైనా.. ఏ పాత్రైనా నాకు ఒకే.. అందులో నటించే అవకాశమొస్తే చాలని అంటూ తన మనసులో మాట చెప్పేసింది. ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. అప్పుడే సిల్వర్ స్క్రీన్‌పై అల్లు అర్జున్, రితికా నాయక్ కాంబోను ఊహించేసుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు. మరి రానున్న రోజుల్లో ఈ ఇద్దరి కాంబోలో సినిమా వచ్చే అవకాశం లేకపోలేదంటున్నారు సినీ జనాలు.రితికా నాయక్ మరోవైపు రెండు సినిమాల్లో నటిస్తోంది. వీటిలో తెలుగు, తమిళ బైలింగ్యువల్ ప్రాజెక్ట్ డ్యుయెట్ ఒకటి. కాగా వరుణ్ తేజ్ హీరోగా నటిస్తోన్న VT15 కూడా ఈ భామ ఖాతాలో ఉంది. ఈ రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి.



# మీనాక్షి స్పీడ్‌కు డక్ అవుట్ అయిన శ్రీలీల..

## మళ్ళీ ఫామ్‌లోకి వచ్చేది ఎప్పుడు

ఎప్పుడొచ్చాం అన్నది కాదన్నాయ్... బుల్లెట్ దిగిందా? లేదా? అని కాస్త మాస్‌గానే అంటున్నారు కిస్సిక్ బ్యూటీ శ్రీలీల. అందం ఉంది, మంచి పెర్ఫార్మర్ అనే పేరుంది.. స్పీడు స్టెప్పులకి, గ్లామర్ రోల్స్ కీ కేరాఫ్ అయ్యే కెపాసిటీ ఉంది.. ఇన్ని ఉన్నా ఉన్నట్టుండి ఆ మధ్య కెరీర్‌లో స్పీడు తగ్గించారు శ్రీలీల. మన దగ్గర ఇప్పటికీ మునుపటి స్పీడును అందుకోలేకపోతున్నారనే కంప్లయింట్ కూడా ఉందనుకోండి.. ఈ వైరల్ వయ్యారి మీద.కెరీర్ బిగినింగ్‌లో శ్రీలీల చూపించిన జోరును.. లాస్ట్ ఇయర్ మీనాక్షి చౌదరి అందుకున్నారు. సంక్రాంతి టు దీపావళి.. ఏ అకేషన్ వచ్చినా మీనాక్షి చౌదరి సినిమా ఉండాల్సిందేనన్నట్టు సాగింది హవా. అసలు ఈ అమ్మాయికి తినడానికీ, తానడానికీ టైమ్ ఉంటోందా? అని ఆశ్చర్యపోయిన వారు కూడా ఉన్నారు.లాస్ట్ ఇయర్ ఎండింగ్‌లో లక్కీ భాస్కర్‌తోనే కాదు.. ఈ ఏడాది స్టార్టింగ్‌లో సంక్రాంతికి వస్తున్నాంలో వెంకటేష్‌కి ఎక్స్ లవర్‌గా నటించి సూపర్ సక్సెస్ అందుకున్నారు. లాస్ట్ ఇయర్ గుంటూరు కారం, ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాంతో పండక్కి హిట్ బోణీ చేయడం అలవాటుగా మారింది మీనాక్షికి.వచ్చే ఏడాది అనగనగా ఒక రాజుతో ఆ హిట్ సెంటిమెంట్‌ని కంటిన్యూ చేయడానికి ట్రై చేస్తున్నారు మీనాక్షి. అంతవరకూ బాగానే ఉంది కానీ, సడన్‌గా ఫిల్మోగ్రఫీలో సినిమాల సైజు ఎందుకు తగ్గినట్టు? అన్నది జనాల ప్రశ్న.అప్పుడెప్పుడో శ్రీలీల తీసుకున్నట్టు.. మీనాక్షి గ్యాప్ స్ట్రమైనా ప్లాన్ చేశారా? అనే చర్చ కూడా షురూ అయింది. దీపం ఉన్నప్పుడే ఇల్లు సర్దుకోవాలి.. అవకావాలు వచ్చినప్పుడే సంతకాలు చేసేయాలంటూ ఈ బ్యూటీకి సజెషన్స్ అందుతున్నాయట వెల్‌విషర్స్ నుంచి. ఆ సలహాలు వినబట్టే.. ధనుష్‌తో ఓ మూవీకి సైన్ చేశారనే మాట కూడా వినిపిస్తోంది కోలీవుడ్‌లో.

# సోషల్ మీడియాకు దూరంగా అనుష్క



చాలా రోజుల విరామం తర్వాత ఇటీవల 'ఘాటి'తో పలకరించారు అనుష్క. కొన్నేళ్లుగా మీడియాకు దూరంగా ఉంటోన్న ఆమె తాజాగా సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉండనున్నట్లు- ప్రకటించారు. సోషల్ మీడియాకు కొంతకాలం బ్రేక్ ఇస్తున్నట్లు- తెలుపుతూ పోస్ట్ పెట్టారు. తానే స్వయంగా లెటర్ రాసి దాన్ని పోస్ట్ చేశారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నా. ఎప్పుడూ స్క్రోలింగ్ చేసే లైఫ్‌కు దూరంగా.. నిజమైన ప్రపంచానికి దగ్గరగా ఉండాలని నిర్ణయించుకున్నా. త్వరలోనే మరిన్ని మంచి కథలతో మరింత ప్రేమతో మీ ముందుకువస్తాను' అని తాను రాసిన లెటర్‌ను పోస్ట్ చేశారు. ఈ లెటర్ వైరల్ కావడంతో అనుష్క (ఆషరీశ) ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారా అని అభిమానులు చర్చించు కుంటున్నారు. ఇటీవల వచ్చిన 'ఘాటి' ప్రచారంలోనూ స్వీటి పరోక్షంగా పాల్గొన్నారు. రానా, అల్లు అర్జున్‌లతో ఫోన్‌లో మాట్లాడి సినిమా విశేషాలతో పాటు- కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను కొన్ని రోజులుగా ఎక్కడికీ వెళ్లడం లేదని చెప్పారు. ఇంట్లో జరిగే పెళ్లిళ్లకు కూడా హాజరుకావడం లేదన్నారు. త్వరలోనే అందరి ముందుకువస్తానని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలు చేస్తానని అభిమానులకు హామీ ఇచ్చారు. ఇక క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్రలో యాక్షన్ -క్రై-మ్ డ్రామాగా 'ఘాటి' రూపొందింది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చిన ఆ చిత్రం మిశ్రమ ఫలితాన్ని అందుకుంది.

# మిరాయ్' సినిమాకు మంచు విష్ణు విషెస్..స్పందించిన మనోజ్



తన తమ్ముడు మంచు మనోజ్ నటించిన మిరాయ్ సినిమా హిట్ కావాలని శుభాకాంక్షలు తెలిపారు అతడి అన్నయ్య మంచు విష్ణు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే విభేధాలు మెల్లిమెల్లిగా సద్దుమణుగుతున్నట్లు తెలుస్తున్నాయి. ఇటీవల కన్నప్ప మూవీ రిలీజ్ కాగా.. తన అన్నయ్య సినిమా కోసం మంచు మనోజ్ థియేటర్‌కు వెళ్లి అందరిని షాక్‌కి గురిచేయగా.. తాజాగా తన మిరాయ్ సినిమా విడుదలవుతున్న సందర్భంగా విషెస్ తెలిపాడు మంచు విష్ణు.'మిరాయ్' సినిమాకు అభినందనలు తెలియజేస్తూ మంచు విష్ణు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "మిరాయ్ చిత్రానికి ఆల్ ది బెస్ట్. ఈ టీమ్‌కు దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను" అని ఆయన ట్వీట్ చేశారు. ఈ పోస్ట్‌లో మంచు మనోజ్‌ను ప్రత్యేకంగా ట్యాగ్ చేయనప్పటికీ, తమ్ముడు నటించిన సినిమా విడుదల సందర్భంగా విషెస్ చెప్పడం అభిమానులను ఆకట్టుకుంది. అయితే ఈ పోస్ట్‌కి మంచు మనోజ్ స్పందిస్తూ.. థాంక్యూ సో మచ్ అన్నా అంటూ రిప్లయ్ ఇచ్చాడు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492